సాక్షి
మంచిర్యాల

శనివారం : 7 : జనవరి : 2023



ఈ-పంచాయతీ ఇక అంతేనా.?

జిల్లాలో ఈ-పంచాయతీ పాలన కార్యరూపం దాల్చ డం లేదు. ప్రతీ పనికి మండల కేంద్రానికి వెళ్లకుండా చూడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ-పంచాయతీ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది.

8లో ▸



భవితకు బంగారు బాట

జవహర్ నవోదయ విద్యాలయంలో 2023-24 విద్యాసంవత్సరానికి ఆరోతరగతిలో ప్రవేశపరీక్ష నిర్వ హించనున్నారు. విద్యాలయంలో 80 సీట్లకు గానూ ఉమ్మడి జిల్లాకు చెందిన ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

8లో ▸

గరిష్టం/కనిష్టం
29.4 /12.4

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతాయి. రాత్రి మంచు ఎక్కువగా కురుస్తుంది. చలితీవ్రత పెరుగుతుంది.



ఖిల్లాపైకి వెళ్తున్న మొకాశి వంశీయులు



మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



నాగదేవతకు పూజలు చేస్తున్న కోవ వంశీయులు

మైసమ్మ తల్లికి నీరా'జనం'

మందమర్రి మండలం బొక్కలగుట్ట శివారులోని గాంధారి ఖిల్లాలో శుక్రవారం గాంధారి మైసమ్మకు పూజలు నిర్వహించారు. కోవ మొకాశి వంశీయులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా పుష్యమాస పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. కోవ వంశీయుల సంస్కృతి, సంప్రదాయం ప్రకారం డప్పులు వాయిస్తూ, నృత్యాలు చేస్తూ ఉత్సవాలు జరుపుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

- రామకృష్ణాపూర్(చెన్నూర్)

న్యూస్‌రీల్

గూడెంలో పుష్యపౌర్ణమి జాతర



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు

దండేపల్లి: రెండో అన్నవరంగా ప్రసిద్ధి చెందిన దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం పుష్యపౌర్ణమి జాతర ఘనంగా నిర్వహించారు. భారీగా భక్తులు తరలివచ్చి సత్యదేవున్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. 109 జంటలు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు. ఆలయ ఆధ్వర్యంలో 600 మందికి అన్నదానం చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది పర్యవేక్షించారు.

రేపు ముగ్గుల పోటీలు

మంచిర్యాలటౌన్: అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ, శ్రీశ్రీ కళావేదిక, సహస్ర ఫైన్‌ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు జాతీయ కార్యదర్శి కట్ల భాగ్యలక్ష్మి, మల్లేశ్ తెలిపారు. హైటెక్‌సిటీ రోడ్ నంబర్ 3లోని సావిత్రి ఫర్నీచర్ రోడ్డులో ఉదయం 9 గంటలకు ఈ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. 19 నుంచి 35 ఏళ్ల వారికి రంగవల్లులు, 35 ఏళ్లు పైబడిన వారికి చుక్కల ముగ్గుల పోటీలు ఉంటాయని తెలిపారు. మెలికల ముగ్గులు అన్ని వయసులవారు వేయొచ్చని పేర్కొన్నారు. రంగవల్లులకు మొదటి బహుమతి రూ.2001, రెండో రూ.1,001, మూడో బహుమతి రూ.501, పది ప్రోత్సాహక బహుమతులను ఇవ్వనున్నట్లు వివరించారు. చుక్కల ముగ్గులకూ బహుమతులు ఉంటాయని తెలిపారు. వివరాలకు 98486 50086 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'పది'లో నూరుశాతం ఫలితాలు సాధించాలి

- డీఈవో వెంకటేశ్వర్లు



డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈవో

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. డీఈవో కార్యాలయంలో ఎస్టీయూ క్యాలెండర్, డైరీని శుక్రవారం ఆవిష్కరించారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలన్నారు. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని పేర్కొన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కోశాధికారి సత్తయ్య, కార్యదర్శి వెంకటేశ్వర్లు, బాధ్యులు శ్రీనివాస్, రమేశ్, మన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పూజా సామగ్రి సరఫరాకు కొటేషన్ల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని విశ్వనాథ ఆలయ ఉత్సవాలు, భక్తుల సౌకర్యార్థం, పరిపాలన సౌలభ్యం కోసం 2023-24 సంవత్సరానికి పూజాసామగ్రి సరఫరాకు కొటేషన్లు స్వీకరిస్తున్నట్లు ఆలయ ఈవో ముక్తారవి తెలిపారు. కిరాణ, పూజ సామగ్రి, టెంట్ సామగ్రి, లైటింగ్, సౌండ్, అలంకరణ పూలు, పూజకు అవసరమయ్యే పుష్పాలు, ఫ్లెక్సీల తయారీ, రంగులు, సున్నం వేయడం, కండువాలు, వస్త్రాలు, శాలువాలు, మినరల్ వాటర్, ప్రింటింగ్ తదితర వాటికి ఆసక్తి ఉన్నవారు కొటేషన్లు వేయవచ్చని వివరించారు. పూర్తి వివరాలకు విశ్వనాథస్వామి ఆలయంలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థుల హాజరుశాతం పెంచాలి




పాఠశాలలో రిజిస్టర్లు పరిశీలిస్తున్న ఆర్‌జేడీ

చెన్నూర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలని ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని సుద్దాల గ్రామంలో మోడల్ పైలట్ పాఠశాలగా ఎంపికైన మండల పరిషత్ పాఠశాల, కిష్టంపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు, మన బడిలో భాగంగా ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెంచి గుణాత్మక విద్యను అందించాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు ఉన్నారు.

అధికారిక సైట్‌పై అలసత్వం!

- బదిలీ అయినా.. పాత ఆఫీసర్ల పేర్లే దర్శనం
- అప్‌డేట్ కాని 'మంచిర్యాల' వెబ్‌సైట్
- పౌరులకు తప్పుడు సమాచారం



All District Officers Contacts

Name	Designation	Email	Mobile No
Smt.Ravula Shailaja	Dist. Intermediate Education Officer, MNCL(FAC)	dieo[dot]mancherial[at]gmail[dot]com	9441874600
Krishna	District Cooperative Officer	dco[dot]coop[dot]mcrl[at]gmail[dot]com	9100115645
G.Gopal	District Manager, T.S.Civil Corporation Ltd.	dmcsdmncl[at]gmail[dot]com	7995050719
Srinivas	District Audit Officer	daosamncl[dot]ts[at]gmail[dot]com	9032196541
Dr.B.Shankar	District Veternary & Animal Husbandary Officer	dvahomancherial[at]gmail[dot]com	8520939904
Vinod	District Agriculture Officer	daomncl[at]gmail[dot]com	7288894008
D SATYANARAYANA	District Fisheries Officer	dfomanchiryal[at]gmail[dot]com	9440814757

మంచిర్యాల వెబ్‌సైట్‌లో కనిపిస్తున్న బదిలీ అయిన అధికారుల పేర్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సమాచార, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతున్న రోబోటిక్ యుగంలో ప్రతీ ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్లు చేరాయి. అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ జిల్లాకు సంబంధించిన సమాచారం ఆన్‌లైన్‌లో పౌరులకు కనిపించడం లేదు. జిల్లా సమగ్ర వివరాలు తెలిపే అధికారిక 'మంచిర్యాల' వెబ్‌సైట్‌లో అనేక వివరాలు అప్‌డేట్ లేకుండా కొనసాగుతున్నాయి. నెలల తరబడి పాత వివరాలే ఉంటున్నాయి. ఏ శాఖలో ఎవరు ఉన్నారనే వివరాలు అప్‌డేట్ కావడం లేదు. జిల్లా అధికారుల బదిలీలు జరిగినా నెలల తరబడి పాతఆఫీసర్ల పేర్లే కొనసాగుతున్నాయి. ఉన్నతాధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు, ఈ మెయిల్ ఐడీతో కూడిన సమాచారం వెబ్‌సైట్‌లో పొందుపర్చాల్సి ఉంది. అయితే పాత అధికారుల పేర్లతోనే వెబ్‌సైట్ కొనసాగుతోంది. గత ఏప్రిల్‌లో బదిలీ అయిన వ్యవసాయ శాఖ అధికారిగా వినోద్‌కుమార్ స్థానంలో జి.కల్పన వచ్చారు. కానీ అధికారిక సైట్‌లో ఇప్పటికీ పాత అధికారి పేరే కనిపిస్తోంది. గత సెప్టెంబర్ 12న అటవీ అధికారి శివానీడోగ్రా బదిలీపై వెళ్లారు. ఆ స్థానంలో శివ్‌ఆశిష్ సింగ్ వచ్చారు. అలాగే పశువైద్యాధికారి గతంలో పని చేసిన బి.శంకర్ పేరు ఇప్పటికీ సైట్‌లో కనిపిస్తోంది. ఈ శాఖలో ఇద్దరు అధికారులు మారి ప్రస్తుతం రమేశ్ కొనసాగుతున్నారు. వైద్యాధికారిగా బాలు పేరు, జిల్లా పౌరసరఫరాల మేనేజర్‌గా జి.గోపాల్, పంచాయతీ అధికారిగా నారాయణరావు, ప్లానింగ్ ఆఫీసరు కృష్ణయ్య తదితర అధికారుల పేర్లు ఉన్నాయి. వీరంతా బదిలీపై వేరే జిల్లాలకు వెళ్లారు. ఇక్కడికి కొత్త వారు వచ్చారు. అయినా అధికారిక సైట్‌లో సమాచారం మార్చడం లేదు. వీటితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల వివరాలు, టెండర్లు సైట్‌లో కనిపించడం లేదు. కొన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు మాత్రం కనిపిస్తున్నాయి. ఇక ఇంగ్లిష్‌లో కనిపించిన వివరాలు తెలుగులో ఉండడం లేదు.

సమాచారం ఇవ్వడంలో అలసత్వం

రాష్ట్రంలో ప్రతీ జిల్లాకు ఓ అధికారిక వెబ్‌సైట్ ఉంది. ఈ సైట్ ద్వారా ప్రతీ ఒకరు జిల్లా సమగ్ర వివరాలు తెలుసుకునేందుకు నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్(ఎన్ఐసీ) ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు వివరాలు మార్పులు చేర్పులు చేయాల్సి ఉంటుంది. అయితే ఎన్ఐసీ అధికారులకు జిల్లా యంత్రాంగం నుంచి ఎప్పటికప్పుడు సమాచారం వెళ్లాల్సి ఉంటుంది. అయితే చాలాసార్లు ఎన్ఐసీకి వివరాలు ఇవ్వకపోవడంతో పాత సమాచారంతోనే వెబ్‌సైట్ కొనసాగుతోంది. వాస్తవానికి జిల్లా సమాచార అధికారి(డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేటిక్ ఆఫీసర్) పేరుతో ఓ పోస్టు ఉన్నప్పటికీ ఆ పోస్టు ఖాళీగా ఉండడంతో సమాచార లోపం ఏర్పడుతోంది. దీంతో జిల్లా పౌరులకు అనేక కీలక విషయాలు తెలిసే అవకాశంలేకుండా పోతోంది.

మెడికల్ కాలేజీ అంతేనా?

ఇక జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ ఏర్పాటై, అనుమతులు వచ్చి, మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులకు తరగతులు కొనసాగుతున్నాయి. అయితే ఇప్పటికీ కాళోజీ నారాయణరావు వైద్యారోగ్య విశ్వవిద్యాలయం అధికార వెబ్‌సైట్‌లో మంచిర్యాల మెడికల్ కాలేజీ వివరాలు కనిపించడం లేదు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల వివరాల్లో మంచిర్యాల కాలేజీ వివరాలు లేవు. ఈ వెబ్‌సైట్ ఆ యూనివర్సిటీ నిర్వహణలో ఉంటుంది. కాలేజీ వివరాలు ఆన్‌లైన్‌లో లేకపోవడంతో కౌన్సెలింగ్ సమయంలో విద్యార్థులు గందరగోళానికి గురయ్యారు.

మైనార్టీలకు స్వయం ఉపాధి రుణాలు

- జిల్లాకు 50 యూనిట్ల కేటాయింపు
- ఇప్పటికే 2,500 దరఖాస్తులు
- ఈనెల 9వ తేదీ వరకు అవకాశం



జిల్లా మైనారిటీ కార్యాలయం

మంచిర్యాలటౌన్: మైనార్టీలను ఆర్థికంగా ఆదుకుని, వారికి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఎట్టకేలకు రుణాలు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈమేరకు జిల్లాకు 50 యూనిట్లను కేటాయించింది. ఈనెల 9వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం ఉండగా, తక్కువ యూనిట్ల మంజూరుతో వేలాది మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈనెల 5వ తేదీ వరకు మొదట గడువును విధించగా 2,500 మంది దరఖాస్తు చేసుకున్నారు. తాజాగా గడువు తేదీని 9 వరకు పొడిగించారు. దరఖాస్తుల సంఖ్య మరింతగా పెరిగేందుకు అవకాశం ఉంది. ఆరేళ్ల తరువాత రుణాలు అందిస్తుండడంతో పోటీ తీవ్రంగా ఉంది. రూ.లక్ష రుణం తీసుకున్న వారికి 80 శాతం రాయితీ ఇవ్వనుండగా, రూ.2 లక్షల రుణం తీసుకునే వారికి 70 శాతం రాయితీ లభించనుంది.

జనాభా ఎక్కువ.. యూనిట్లు తక్కువ

జిల్లాలో 2011 జనాభా లెక్కల ప్రకారం మైనార్టీ జనాభా 45,600, ప్రస్తుతం 60 వేలకు పైగా ఉన్నట్లు మైనార్టీ సంక్షేమ శాఖ అంచనా. ఇందులో నిరుపేద కుటుంబాలు సగానికి పైగానే ఉంటాయి. కానీ జిల్లాకు కేవలం 50 యూనిట్లను మంజూరు చేశారు. ఇందులో రెండు కేటగిరీల వారీగా యూనిట్లు ఉండగా, అందులో రూ.లక్ష రుణంకు సంబంధించిన యూనిట్లు 35, రూ.2 లక్షల రుణంకు సంబంధించిన యూనిట్లు 15 మాత్రమే ఉన్నాయి. ఆరేళ్ల తరువాత సబ్సిడీ రుణాలను అందిస్తుండగా, మైనార్టీలో నెలకొన్న ఆనందం యూనిట్లు తక్కువగా కేటాయించడంతో ఆవిరైపోయింది. జనాభాకు అనుగుణంగా యూనిట్ల సంఖ్య పెంచాల్సింది పోయి, తగ్గించి, రూ.లక్ష రుణాలే అధికంగా ఇవ్వడం వలన ఉపాధి అవకాశాలు పెంచేందుకు అవి ఏమాత్రం సరిపోవని పేర్కొంటున్నారు. యూనిట్లను పెంచడంతోపాటు, రూ. 2 లక్షలకు సంబంధించిన రుణాలు ఎక్కువ అందించాలని మైనార్టీలు కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని మైనార్టీలకు ప్రభుత్వం రాయితీ రుణాలను అందించేందుకు 50 యూనిట్లు కేటాయించింది. అర్హులైన వారు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 9వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలి. ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల ద్వారా విచారణ జరిపించి, అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయడం జరుగుతుంది. ఈ అవకాశాన్ని మైనారిటీలు సద్వినియోగం చేసుకోవాలి.

– నీరటి రాజేశ్వరి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి

కోలిండియా పోటీల్లో రాణించాలి



విజేతలతో ఏరియా జీఎం శ్రీనివాస్

మందమర్రిరూరల్: సింగరేణి స్థాయి పోటీల్లో సత్తా చాటిన క్రీడాకారులు కోలిండియాస్థాయి పోటీల్లోనూ రాణించాలని మందమర్రి ఏరియా జీఎం శ్రీనివాస్ సూచించారు. సింగరేణి హైస్కూల్ మైదానంలో డబ్ల్యూపీఎస్అండ్‌జీఏ ఆధ్వర్యంలో జరిగిన కంపెనీస్థాయి లాన్‌టెన్నిస్, బాస్కెట్‌బాల్ పోటీల ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ కోలిండియాలో బాస్కెట్‌బాల్ పోటీల్లో సింగరేణి జట్టుకు ప్రవేశం కల్పించాలని ప్రతిపాదన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం కృష్ణారావు, హెచ్‌వోడీ శ్యాంసుందర్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్స్ సుందర్‌రాజ్, అశోక్, జాన్‌వెస్లీ, శ్రీనివాస్, రమేశ్, ఏరియా కోఆర్డినేటర్ చిన్నయ్య, యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

లాన్‌టెన్నిస్ మెన్స్ సింగిల్స్‌లో మొదటి స్థానం జి.నాగేశ్వరరావు(ఆర్జీ-3) రెండోస్థానం జైశ్రీమన్నారాయణ(ఆర్జీ-3), డబుల్స్‌లో మొదటిస్థానం బెక్కం రవి, సంజీవ్ (ఆర్జీ-1, 2), రెండోస్థానం నాగేశ్వరరావు, శ్రీరాములు (ఆర్జీ-3, భూపాలపల్లి), వెటరన్ సింగిల్స్‌లో మొదటిస్థానం ఎస్.రమేష్,(ఆర్జీ-1) రెండోస్థానం ఏ.వెంకటేశ్వర్లు (ఆర్జీ-2), వెటరన్ డబుల్స్‌లో మొదటిస్థానం వై.తిరుమలరావు, కేసీహెచ్.రెడ్డి (ఆర్జీ-3, భూపాలపల్లి), రెండో స్థానం ఎస్.రమేష్, వెంకటేశ్వర్లు (ఆర్జీ-1, 2) నిలిచారు. బాస్కెట్‌బాల్ పోటీల్లో మొదటి స్థానం (ఆర్జీ-1, 2), రెండో స్థానం మణుగూరు, ఎల్లందు జట్లు నిలిచాయి.

ఎన్‌ఆర్‌ఐ ఔదార్యం

- 25 మంది పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ



విద్యార్థులకు సైకిళ్లు అందిస్తున్న దాతలు

చెన్నూర్: మంచిర్యాలకు చెందిన ఎన్ఆర్ఐ కుటుంబం ఔదార్యం చాటుకుంది. నిరుపేద విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన ఎన్ఆర్ఐ మురికి వేణు సహకారంతో హెల్పింగ్ హ్యాండ్స్ సారథ్యంలో చెన్నూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 25 మంది విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. చెన్నూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ ముకేశ్‌గౌడ్ సైకిళ్లు అందించారు. దూర ప్రాంతాల నుంచి బడికి వచ్చే పేదపిల్లలకు సైకిళ్లు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. దాత తల్లి సుశీల, మురికి వెంకట్, ఏఈవో రాధాకృష్ణమూర్తి, హెల్పింగ్ హ్యాండ్స్ కార్యదర్శి సాదిక్‌పాషా, అశోక్, రమేశ్, సరిత, ప్రధానోపాధ్యాయురాలు లీలారాణి, కరుణాకర్ పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

నస్పూర్: మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా పలు పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ రాహుల్ సూచించారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో చేపట్టి అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడానికే ప్రభుత్వం మన ఊరు మన బడి కార్యాక్రమం చేపట్టిందని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ రమేశ్ ఉన్నారు.

ఆలయాల అభివృద్ధి కోసం మంత్రికి వినతి



ఇంద్రకరణ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి: బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఆలయాలను అభివృద్ధి చేయాలని, సౌకర్యాలు కల్పించాలని, ఇందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి విన్నవించారు. హైదరాబాద్‌లో శుక్రవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. అటవీ భూముల్లో రోడ్ల నిర్మాణానికి అనుమతులు ఇప్పించాలని కోరారు. బుగ్గ దేవాలయానికి వెళ్లడానికి రోడ్డు కోసం నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. నెన్నెల మండలం నుంచి వేమనపల్లి మండలం చామనపల్లి గ్రామానికి, కన్నెపల్లి మండలం ముత్తాపూర్ గ్రామం నుంచి వేమనపల్లి గ్రామం వరకు రోడ్ల నిర్మాణానికి అటవీ అనుమతులు ఇప్పించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట బెల్లంపల్లి ఏఎంసీ చైర్మన్ నిరంజన్ గుప్తా, తాండూర్ జెడ్పీటీసీ బానయ్య, బీఆర్ఎస్ నాయకులు వేణు, సుభాష్‌రావు, భీమాగౌడ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ధాన్యం బస్తాలు స్వాధీనం

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత బస్టాండ్ సమీపంలో గల దేవాపూర్ రైల్వే కీ పాయింట్ వద్ద పడిఉన్న 21 ధాన్యం బస్తాలను శుక్రవారం ఆర్ఐ రవికిశోర్ స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వరదరాజుకి సమాచారం అందించడంతో పంచనామా చేశారు. రైల్వే కీపాయింట్ నిర్వాహకుడు రాజేశ్‌కుమార్ శుక్రవారం ఉదయం బస్తాలు వరుసగా పడి ఉండగా వాటిని కుప్పగా వేశాడన్నారు. ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ రైల్వే ట్రాక్ వద్ద ఏర్పాటు చేసిన ఆర్చ్‌కి తగలడంతో బస్తాలు కిందపడి ఉంటాయని అనుమానం వ్యక్తం చేశారు. స్వాధీనం చేసుకున్న బస్తాలను సమీపంలోని సప్తగిరి రైస్ మిల్లులో భద్రపరిచామన్నారు. తదుపరి విచారణ కోసం ఉన్నతాధికారులకు నివేదిక అందించానని డీటీ తెలిపారు.


కృత్రిమ గర్భధారణతో మేలు జాతి పశువులు



మందులు అందిస్తున్న పశువైద్య సంచాలకులు

వేమనపల్లి: కృత్రిమ గర్భధారణతో మేలు జాతి పశువులను ఉత్పత్తి చేసుకోవచ్చని జిల్లా పశువైద్య సంచాలకులు రమేశ్‌కుమార్ అన్నారు. వేమనపల్లి మండలం మంగెనపల్లి గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో పాల్గొన్నారు. గ్రామంలోని సుమారు 5 పశువులకు కృత్రిమ గర్భధారణ చేశారు. గర్భకోశ వ్యాధులతో బాధపడుతున్న సుమారు 40 పశువులకు వైద్యం అందించారు. పాడి పశువుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సంరక్షణ చర్యలు వివరించారు. పశువులకు అందించాల్సిన పోషక విలువలు ఉన్న దాణా, పశువుల పాకల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు మందులు అందజేశారు. ఆయన వెంట మండల పశువైద్యాధికారి చందన్‌కుమార్, సిబ్బంది ఫెరోజ్, అస్లాం ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలఅర్బన్: విద్యావ్యవస్థలో స్పష్టమైన మార్పులు తెస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో గుణాత్మక విద్య అందించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. పీఆర్టీయూ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. మనఊరు-మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయన్నారు. నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి తెలంగాణ విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడైనా పోటీపడేలా ఉండాలన్నదే ముఖ్యమంత్రి ఆకాంక్ష అన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ గౌరవ అధ్యక్షుడు పర్వతి సత్యనారాయణ, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సాగర్, సాంబయ్య, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు సంపత్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పట్టాలు



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

భీమిని: ధరణి పోర్టల్ సమస్యతో ఎవరికీ ఇబ్బంది కలుగకుండా అర్హులందరికీ పట్టాలు ఇస్తామని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ తెలిపారు. భీమిని మండలం తంగళ్లపల్లి గ్రామంలో 600 ఎకరాల భూమి ఉంది. ఇందులో సర్వే నంబర్ 1 నుంచి 59 వరకు ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితాలో చేర్చారు. దీనిపై రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు గ్రామంలోని పాఠశాల ఆవరణలో శుక్రవారం రైతులతో సమావేశమయ్యారు. తమ భూములు నిషేధిత జాబితాలో చేర్చడంతో రైతుబంధు, రైతుబీమా ఇవ్వడం లేదన్నారు. తమకు పట్టాలు అందజేసి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కోరారు. గతేడాది జూన్‌లో రెవెన్యూ అధికారులు రీసర్వే కూడా చేశారు. శుక్రవారం రైతుల నుంచి వివరాలు సేకరించి ఎంజాయిమెంట్ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్యామలదేవి, తహశీల్దార్ పరమేశ్వర్, సర్పంచ్ ఇందూరి భూమయ్య, డీఐ నజీరొద్దీన్, డీటీ లక్ష్మీరాజం, రోహిత్‌దేశ్‌పాండే, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దేహదారుఢ్య పరీక్షల్లో 4,780 మందికి అర్హత

ఆదిలాబాద్‌టౌన్: ఎస్సై, పోలీసు కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 4,780 మంది అభ్యర్థులు అర్హత సాధించినట్లు టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ చైర్మన్ వీవీ శ్రీనివాస్‌రావు శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. ఇందులో బీసీ వర్గానికి చెందిన వారు 2,305, ఓసీ వర్గానికి చెందిన వారు 63 మంది, ఎస్సీలు 988 మంది, ఎస్టీలు 1,424 మంది ఉన్నట్లు తెలిపారు. వీరిలో పురుషులు 3,740 మంది, మహిళా అభ్యర్థులు 1040 మంది, ఎక్స్ సర్వీస్‌మెన్ కుటుంబాలకు చెందిన వారు 16 మంది ఉన్నట్లు పేర్కొన్నారు.

ఇరాక్‌లో జన్నారం వాసి మృతి


సాయిలు(ఫైల్)

జన్నారం(ఖానాపూర్): ఉపాధి వేటలో ఒకరి ఊపిరి ఆగింది. జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఎలుక సాయిలు (45) కొన్నేళ్లుగా ఇరాక్‌లోని ఓ కంపెనీలో కూలి పని చేస్తున్నాడు. ఏడాది క్రితం స్వగ్రామానికి వచ్చిన సాయిలు మళ్లీ తిరిగివెళ్లాడు. గురువారం అతనికి చాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో అతనితో కలిసి పనిచేసేవారు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి భార్య పద్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. విషయం తెలియగానే కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించాలని కోరుతున్నారు.

పాము కాటుతో రెండేళ్ల చిన్నారి మృతి

చెన్నూర్‌రూరల్:రెండేళ్లకే ఆ చిన్నారికి నూరేళ్లు నిండాయి. మృత్యువు పాము రూపంలో చిన్నారిని కబళించింది. చెన్నూర్ మండలం శివలింగాపూర్ గ్రామానికి చెందిన చిగిరి సంధ్య, మధుకర్ దంపతుల కూతురు మనశ్రీ(2) శుక్రవారం పాముకాటుకు గురై మృతి చెందింది. మనశ్రీ ఇంటి ముందు ఉన్న రోడ్డుపై ఆడుకుంటున్న సమయంలో పాటు కాటేసింది. అక్కడే ఉన్న మరోబాబు చూసి మనశ్రీ తండ్రి మధుకర్‌కు విషయం చెప్పాడు. వెంటనే అతను ద్విచక్ర వాహనంపై చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో మంచిర్యాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది.

అప్లికేషన్లు నమోదు చేసుకోవాలి

ఉట్నూర్: కాళోజీ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ నర్సింగ్, బీపీటీ కన్వీనర్ కోటాలో సీటు పొందాలనుకునే గిరిజన విద్యార్థులు ఈ నెల 8వ తేదీ సాయంత్రం వరకు టీఎస్‌పీఏఆర్‌పీ ఎంఈడీ.టీఎస్‌సీహెచ్‌ఈ.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని ఐటీడీఏ పీవో వరుణ్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సు నాలుగేళ్లు, బీపీటీ రెండేళ్ల కోర్సులో చేరాలనుకునే గిరిజన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఆస్పత్రిలో గర్భిణి మృతి

దహెగాం(సిర్పూర్): పెంచికల్‌పేట్ మండలం పోతెపెలికి చెందిన గర్భిని డోకె స్వరూప (22) కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దహెగాం మండలం రాళ్లగూడ గ్రామానికి చెందిన భుజంగరావు కుమార్తె మొదటి కాన్పుకు తల్లిగారింటికి సోమవారం వచ్చింది. దీంతో బుధవారం మంచిర్యాల ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకుని రాళ్లగూడకు వెళ్లింది. గురువారం సాయంత్రం పురిటినొప్పులు రావడంతో కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది.

'అమ్మ'కు నీరాజనం


రావుడ్ దేవతకు మొక్కుతున్న అధికారులు


మైసమ్మకు మొక్కుతున్న జిల్లా అధికారులు

కుమురంభీం జిల్లా కెరమెరి మండలంలోని జంగుబాయి ఆలయంలో శుక్రవారం మహాపూజ నిర్వహించారు. కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీ గోడం నగేశ్, ఐటీడీఏ చైర్మన్ కనక లక్కేరావ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జంగుబాయి గుహను సందర్శించి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఏపీవో భాస్కర్, ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఎంపీవో సుదర్శన్, ఎస్సై వెంకటేశ్, ఎంపీపీ పెందోర్ మోతిరాం, తదితరులు పాల్గొన్నారు. - కెరమెరి



'పోతురాజ్'కు పోటెత్తిన భక్తజనం

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని సావర్‌ఖెడా, ఇందాపూర్ సమీపంలో ఉన్న పోతురాజ్ ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. భీమదేవరా, తదితర ప్రతిమలకు, నాలుగు గోత్రాలకు చెందిన నాలుగు జెండాలకు పూజలు చేశారు. మైసమ్మకు నూనెతో అభిషేకం చేశారు. ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఆదివాసీ మహిళలు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. - కెరమెరి


మైసమ్మకు మొక్కుతున్న భక్తులు

ఈ-పంచాయతీ ఇక అంతేనా.?

- జిల్లాలోని 110 క్లస్టర్లకు కంప్యూటర్లు
- పల్లెల్లో అందని ఆన్‌లైన్ సేవలు
- నెట్ ఉన్నా ముందుకు సాగని పనులు
- ప్రతి పనికీ మండల కేంద్రానికి వెళ్తున్న ప్రజలు
- అధికారుల నిర్లక్ష్యంతో తప్పని ఇబ్బందులు


హాజీపూర్ పంచాయతీ కార్యాలయంపై ఏర్పాటు చేసిన సోలార్ ఎనర్జీ పాయింట్లు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో ఈ-పంచాయతీ పాలన ఏ మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. గ్రామ పంచాయతీల ద్వారానే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ప్రతీ పనికి మండల కేంద్రానికి వెళ్లకుండా చూడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ-పంచాయతీ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చింది. కుల, నివాసం, ఆదాయ ధృవీకరణ పత్రాలు, ఇంటి, నీటి పన్నుల వసూళ్లు కూడా అంతా ఆన్‌లైన్ ద్వారానే చేపట్టాలని నిర్ణయించింది. అయితే ఇప్పటి వరకూ ఈ సేవలు ప్రజలకు చేరువ కాలేదు.

2018లో ఈ-పంచాయతీకి అంకురార్పణ

మంచిర్యాల జిల్లాలోని 16 మండలాల్లో 310 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2018లోనే ప్రభుత్వం ఈ-పంచాయతీ పాలనకు అంకురార్పణ చేసింది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు జనన, మరణ, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో పాటు ఇంటి, నీటి పన్నుల వసూళ్లు, ఇంటి నిర్మాణ అనుమతులు ఇలా అన్ని పనులు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని నిర్ణయించింది. 310 గ్రామ పంచాయతీలను 110 క్లస్టర్లుగా విభజించి క్లస్టర్‌కు ఒకటి చొప్పున కంప్యూటర్ అందించి తెలంగాణ-టీఫైబర్ ఇంటర్నెట్ సౌకర్యం కల్పించింది. పంచాయతీ భవనాల్లో సర్వర్ ప్యానల్ బాక్సులు, భవనాలపై సోలార్ ఎనర్జీ పాయింట్లను ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు అధికారికంగా 300 పంచాయతీల్లో నెట్ సౌకర్యం అందుబాటులోకి వచ్చినట్లు తెలుస్తోంది. అయినా ఏ ఒక్క పంచాయతీలో కూడా ఈ-పంచాయతీ అందుబాటులోకి రాకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రతీపనికి మండల కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది.

వివిధ రకాల సేవలు ఇవే..

- జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీతో పాటు ఇంటిపన్నుల వసూళ్లు, నీటిపన్నుల వసూళ్లు, గ్రామ పంచాయతీలకు విడుదలయ్యే నిధుల విషయంలో పారదర్శకంగా ఉండబోనుంది.
- పంచాయతీలకు వచ్చిన నిధులు ఎన్ని, ఖర్చు చేసిన వివరాలు, అభివృద్ధి పనుల విషయంలో పూర్తి పారదర్శకంగా ఉండాలంటే ఆన్‌లైన్ ద్వారానే సేవలు అమలులో ఉంటేనే సాధ్యమవుతుంది.
- మాన్యువల్‌గా అయితే రికార్డుల్లో పొందుపర్చిన వివరాలు మళ్లీ రాసే అవకాశం ఉంటుంది. ఆన్‌లైన్‌లో వివరాలు ఒక్కసారి నమోదు చేస్తే తిరిగి ఆ వివరాలను మార్చడం వీలుకాదు.

చర్యలు చేపడతాం



ఈ-పంచాయతీ విధానాన్ని అమలులోకి తీసుకువస్తూ ఆన్‌లైన్‌లో గ్రామ ప్రజలకు సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 110 క్లస్టర్లకు కంప్యూటర్లు అందించింది. చాలా గ్రామాల్లో నెట్ సౌకర్యం లేక ఆన్‌లైన్ వ్యవస్థ అందుబాటులోకి రాలేదు. ప్రస్తుతం అన్ని జీపీలకు టీ-ఫైబర్ ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించింది. గతంలో పంపిణీ చేసిన వాటిలో ఉన్న వాటితో పాటు అవసరమైతే మరిన్ని కంప్యూటర్లను సమకూర్చుకునేలా చూస్తాం. ఈ-పంచాయతీ సేవలు అందుబాటులో తీసుకువచ్చేలా చర్యలు చేపడతాం.
– ఫణీందర్‌రావు, డీపీఓ, మంచిర్యాల

50 ఉన్నా మరో 60 ఊసే లేదు..

110 కంప్యూటర్లలో 50 కొంతలో కొంత పని చేస్తున్నప్పటికీ మిగిలిన 60 కంప్యూటర్ల లెక్క కనిపించడం లేదు. అయితే మాకు ఎలాంటి కంప్యూటర్లు అప్పగించలేదని గత సర్పంచ్‌లు చెప్తున్నారు. మరికొన్ని పంచాయతీల్లో కంప్యూటర్లు దుమ్ము పట్టి పనికి రాకుండా పోయాయి. నెట్ ఉన్న పంచాయతీలు కంప్యూటర్లకు మరమ్మతు చేయించి ఈ-పాలన అమలుకు కార్యదర్శులు కృషిచేసే అవకాశం ఉన్నా ఆదిశగా పనిచేయడం లేదు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

జన్నారం(ఖానాపూర్): మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన నగేశ్ ఉపాధి నిమిత్తం దుబాయికి వెళ్లాడు. కంపెనీ వీసాకోసం ప్రయత్నిస్తున్న సమయంలో ఓ కంపెనీ వద్ద గ్యాస్ లీకేజీ అయి గాయాల పాలయ్యాడు. ఈ క్రమంలో అక్కడి తెలుగువారు అతన్ని ఆస్పత్రిలో చేర్పించారు. విషయాన్ని తెలంగాణ గల్ఫ్ సంక్షేమ సమితి రోటిగూడ కమిటీకి సమాచారం అందివ్వడంతో స్పందించిన కమిటీ సభ్యులు విరాళాలు సేకరించగా వచ్చిన రూ.51 వేలను శుక్రవారం కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సేపూరి గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం గల్ఫ్ బోర్డు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శ్రీనివాస్, మల్లేశ్, మల్లారెడ్డి, రాజరెడ్డి, శ్రీనివాస్, లక్ష్మణ్, గంగన్న పాల్గొన్నారు.

ట్రాక్టర్ సీజ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీ సాయికుంట చెరువు సమీపంలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు శుక్రవారం ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. సాయికుంట చెరువును సుందరీకరణ ముసుగులో అక్రమంగా తవ్వకాలు చేస్తున్నట్లు అధికారులు ఫిర్యాదులు అందాయి.

భవితకు బంగారు బాట



కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయం

- జవహర్ నవోదయలో ఆరోతరగతిలో ప్రవేశప్రక్రియ షురూ
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- ఈ నెల 31 వరకు గడువు
- ఏప్రిల్ 29న ప్రవేశ పరీక్ష

కాగజ్‌నగర్‌టౌన్: కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని స్వయం ప్రతిపత్తి గల సంస్థ, అక్షరాస్యత, పాఠశాల విద్యావి భాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న జవహర్ నవో దయ విద్యాలయంలో 2023-24 విద్యాసంవత్సరా నికి ఆరోతరగతిలో ప్రవేశపరీక్ష నిర్వహించనున్నా రు. విద్యాలయంలో 80 సీట్లకు గానూ ఉమ్మడి జిల్లా కు చెందిన ఆసక్తి గల విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 31 వరకు దరఖాస్తుకు గడువు విధించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు 2023, ఏప్రిల్ 29న(శనివారం) ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు విద్యాలయ సమితి ఆధ్వర్యంలో ప్రక్రియ ప్రారంభించారు.

అర్హతలు ఇవే..

- 2022-23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతూ ఉండాలి.
- ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలల్లో 3, 4 తరగతులు పూర్తి విద్యా సంవత్సరాలు చదివి ఉత్తీర్ణులై ఉండాలి. విద్యార్థులు 2011, మే1 నుంచి 2013 ఏప్రిల్ 30 మధ్య జన్మించిన వారై ఉండాలి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి



కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మంచి భవిష్యత్తు కోసం విద్యార్థులు కష్టబడి చదవాలి. మరిన్ని వివరాలకు విద్యాలయంలో సంప్రదించాలి.
– బి.చక్రపాణి, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ విద్యాలయం

- కనీసం 75 శాతం సీట్లు జిల్లాలోని గ్రామీణ విద్యార్థులతో నింపబడతాయి.
- ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులైన విద్యార్థులకు రిజర్వేషన్ ఉంటుంది.
- బాలికలకు కనీసం 1/3 వంతు సీట్లు కేటాయించబడ్డాయి.

విద్యాలయం ప్రత్యేకతలు

- జిల్లా విద్యాలయంలో సహవిద్యా, ఆవాసీయ పాఠశాల
- బాలబాలికలకు ప్రత్యేక హాస్టల్
- ఉచిత విద్య, భోజన, వసతి సదుపాయాలు
- మైగ్రేషన్ పథకం ద్వారా విస్తృతమైన సాంస్కృతిక వినిమయం
- స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వృద్ధి
- ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్‌ఎస్‌ఎస్
- నాణ్యమైన విద్యపై ప్రత్యేక దృష్టి, ఉత్తమ ఫలితాల సాధన
- జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్‌డ్, నీట్ వంటి ఉన్నత పరీక్ష ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ
- 'పది' ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధన.

క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటాలి


మాట్లాడుతున్న శశాంక్ యాదగిరి

బెల్లంపల్లి: క్రికెట్ పోటీల్లో రైల్వే క్రీడాకారులు ప్రతిభ చాటాలని దక్షిణ మధ్యరైల్వే బెల్లంపల్లి డివిజన్ ఇంజినీర్ శశాంక్ యాదగిరి అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి రైల్వే ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో డివిజన్‌స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన పోటీలు ప్రారంభించి మాట్లాడారు. కొన్నాళ్ల విరామం తర్వాత రైల్వే క్రీడాకారులకు క్రీడాపోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇనిస్టిట్యూట్ సెక్రటరీ రమేశ్, జాయింట్ సెక్రెటరీ సాల్మన్ మాట్లాడుతూ పోటీలు ఈ నెల 17 వరకు జరుగుతాయన్నారు. మహారాష్ట్రలోని మాణిక్ ఘడ్ నుంచి రామగుండం వరకు రైల్వే క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారని, మొత్తం 15 టీమ్‌లు వచ్చాయని వివరించారు. ఈకార్యక్రమంలో బెల్లంపల్లి రైల్వే స్టేషన్ మేనేజర్ రవీందర్, రైల్వే కార్మిక సంఘాల నాయకులు నాగరాజు, సాంబశివుడు, అధికారులు బుచ్చిబాబు, హరిబాబు, అనిల్, రమేశ్, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

'స్కీంవర్కర్లను కార్మికులుగా గుర్తించాలి'



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

పాతమంచిర్యాల: స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఏఓ సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస ప్రకాష్, ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. దేశవ్యాప్తంగా కోటి మంది రాష్ట్రంలో 3.50 లక్షలమంది స్కీంవర్కర్లు ఏళ్ల తరబడిగా పనిచేస్తున్నా ఉద్యోగ భద్రత లేదన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు దాసరి రాజేశ్వరి, ఐకేపీ వీవోఏల జిల్లా అధ్యక్షుడు డూర్కె మోహన్, కార్యదర్శి కుమార్, కోశాధికారి దుర్గం లక్ష్మణ్, జిల్లా కమిటీ సభ్యులు లచ్చన్న, దాసు, లింగన్న, తుకారాం, తిరుపతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా


బోల్తా పడిన వడ్ల లారీ

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలోని బొప్పారం నర్సరీ వద్ద గురువారం రాత్రి అదుపుతప్పి లారీ బోల్తా పడినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. లక్సెట్టిపేట నుంచి నందులపల్లి రైస్‌మిల్లుకు వడ్ల బస్తాలతో వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న మరో వాహనానికి సైడ్ ఇచ్చేక్రమంలో రోడ్డుదిగిన లారీ పైకి ఎక్కేక్రమంలో ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్, క్లీనర్ అప్రమత్తంగా ఉండటంతో పెను ప్రమాదం తప్పింది. అటవీ శాఖ అధికారుల అనుమతి లభించకపోవడంతో కాంట్రాక్టర్ రోడ్డును తక్కువ వెడల్పుగా వేయడం, ఇరువైపులా మొరం పోయించకపోవడంతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటి వరకు 30 నుంచి 40 ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఇప్పటికైనా రోడ్డుకు ఇరువైపులా మొరం పోయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాసర ఆలయంలో పౌర్ణమి పూజలు


ప్రత్యేక హోమం నిర్వహిస్తున్న అర్చకులు

బాసర(ముధోల్): పుష్యమాస పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం బాసర అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు, వేద పండితులు సరస్వతీ మంత్ర సహిత చండీహోమం నిర్వహించి శతఃఅర్చన పూజలు జరిపించారు. ఆలయ అధికారులు, వైదిక బృందం సభ్యులు పాల్గొన్నారు.

ప్రమాదాలపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్(మంచిర్యాల): గనుల్లో ఎలక్ట్రికల్ ప్రమాదాలపై ఉద్యోగులకు అవగాహన కల్పించాలని డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(డీఎంఎస్) ఆనంద్‌వేల్ అన్నారు. శుక్రవారం సీసీసీలోని సింగరేణి గెస్ట్‌హౌజ్‌లో సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ ఎలక్ట్రికల్‌కు సంబంధించిన అంశాలపై జీఎం బీ.సంజీవరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌వేల్ మాట్లాడుతూ సింగరేణిలో కొన్ని సంవత్సరాలుగా ప్రమాదాలు చాలా తగ్గాయన్నారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ డీఎంఎస్ గౌరవ్‌లడ్డా, ఇందారం ఓసీపీ అధికారి శ్రీనివాస్, ఏరియా ఇంజినీర్ రమేశ్ బాబు, ఏరియా రక్షణాధికారి గోషిక మల్లేశ్, మేనేజర్ రవికుమార్, ప్రాజెక్ట్ ఇంజనీర్ రమేశ్, గని రక్షణాధికారి ఏఆర్ సహాని పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి


యూనిట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్: ఐకేపీ ఆధ్వర్యంలో మహిళలకు అందజేస్తున్న రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని అడిషనల్ డీఆర్‌డీవో చరణ్‌దాస్, ప్రాజెక్ట్ మేనేజర్(డీపీఎం) వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని లంబాడితండా, మాలగురిజాల, రంగపేట, బుధాకుర్దు గ్రామాల్లో లబ్ధి దారులు ఏర్పాటు చేసుకున్న యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుణాలు తీసుకున్న మహిళలు వాటిని సక్రమంగా వినియోగించి అభివృద్ధి చెందేలా చూసుకోవాలన్నారు. దుర్వినియోగం చేసుకుని ఇబ్బందులకు గురికావద్దన్నారు. సంఘాల్లో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమదృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శ్యామల, సీసీ ప్రసాద్, వీవోఏలు పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూటరీ కాలువకు మరమ్మతులు

జన్నారం: కొన్నేళ్లుగా నిలిచిపోయిన డిస్ట్రిబ్యూటరీ కాలువకు మరమ్మతు పనులు ఎట్టకేలకు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 2018లో కడెం ప్రధాన కాలువలోని 13వ డిస్ట్రిబ్యూటరీ మరమ్మతులకు రూ.8 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ దక్కించుకున్న అప్పటి కాంట్రాక్టర్ పనులు చేయకుండానే వెళ్లిపోయాడు. ఆ తర్వాత ఆ పనిని రెండు భాగాలు విభజించారు. రూ.4 కోట్లతో దేవునిగూడ నుంచి రేండ్లగూడ వరకు, రేండ్లగూడ నుంచి బాదంపల్లి వరకు పనులు చేయాల్సి ఉంది. ఇందులో మొదటి భాగం పనులు ప్రారంభించారు.

కాసిపేట-2 గనిలో ప్రమాదం

- ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్‌కు గాయాలు

కాసిపేట(బెల్లంపల్లి): మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 గనిలో గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్ ప్రేమ్‌కుమార్‌కు గాయాలయ్యాయి. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి సదరు కార్మికుడు గనిలోని ఫోర్త్‌లెవల్ నార్త్ జోన్‌లో విధులు నిర్వర్తిస్తుండగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ట్రాన్స్‌ఫార్మర్ నుంచి మంటలు చెలరేగి కార్మికుడిని తాకడంతో చేతిభాగం కాలిపోయింది. గమనించిన తోటి కార్మికులు ప్రేమ్‌కుమార్‌ను రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఆస్పత్రికి తరలించారు. ఇటీవల మూడు రోజుల క్రితం గనిలో రోఫ్ తగిలి కార్మికుడి కాలు విరిగింది. వరుస ఘటనలతో కార్మికులు భయాందోళన చెందుతున్నారు. శుక్రవారం సంఘటన స్థలాన్ని ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ లడ్డా సందర్శించి వివరాలు సేకరించారు.